సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



..రచనలు అవసరం

నవ సమాజ నిర్మాణానికి నవలలు దోహదపడతాయని హరగోపాల్ అన్నారు.

వివరాలు 8లో ▸



గోదాంలో ధాన్యం చోరీ

చిన్నంబావి మండలం పెద్దగడ్డ శివారులో 2,500 మె.ట. ధాన్యం అపహరించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 37.5 /20.2

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రివేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటాల్ రూ.7,401



కల్వకుర్తి రూరల్: వేరుశనగ ధర ప్రతిరోజూ కాస్త పెరుగుతూ వస్తుంది. ఆదివారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు 276 మంది రైతులు 10 వేల బస్తాల్లో 3,027 క్వింటాళ్ల వేరుశనగను మార్కెట్‌కు అమ్మేందుకు తీసుకొచ్చారు. అత్యధికంగా రూ.7,401 ధర లభించగా.. మధ్యస్తంగా రూ.7,030 ధర లభించింది. తక్కువగా రూ.4,001 ధర పలికింది. క్వింటాల్ కందులు రూ.9,220 ధర పలికింది. గత కొద్ది రోజులుగా వేరుశనగ ధరలు పెరుగుతూ వస్తున్నాయి.

పెండింగ్ రుణాలు విడుదల చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పుల్జాల పరశురాములు డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆరు సంవత్సరాల నుంచి కార్పొరేషన్ రుణాలు ఇప్పటికీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం దళితబంధు పేరుతో ఎస్సీ కార్పొరేషన్ రుణాలను పెండింగ్‌లో ఉంచి, మంజూరైనప్పటికీ ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని , గ్రౌండింగ్ పూర్తి చేయాలని కోరారు. అంటరానితనం రూపుమాపడానికి దళితవాడల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి నెల 30న అధికారులతో పౌరహక్కుల దినాన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, నందిపేట భాస్కర్, జగన్, వంకేశ్వరం ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలోని రుగ్మతల నిర్మూలనే 'మట్టివాసన'



కందనూలు: సమాజంలోని రుగ్మతల నిర్మూలనను ప్రతిబింబించిన కవిత్వమే 'మట్టి వాసన' అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్ పాఠశాలలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రైవేటు వైద్యులు లఘుచిత్రాల నిర్వాహకులు, కవి యడవల్లి నాగరాజు రచించిన మట్టివాసన కవిత్వ సంపుటిని సీనియర్ జర్నలిస్ట్ కందికొండ మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమానికి సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెబ్బేటి మల్లికార్జున్ మాట్లాడారు. సమాజంలోని అసమానతలు, అంటరానితనం, మూఢనమ్మకాలు, రుగ్మతలను నిర్మూలించే కవిత్వం నాగరాజు రాశాడని అన్నారు. ఈ కవిత్వంలో అభ్యుదయ కవులు విప్లవకవులు దళితోద్యమ కవిత్వాలు ఎన్నో వచ్చాయని అదే కోవలో వివిధ అంశాలపై యడవల్లి నాగరాజు తన కవిత్వంలో ప్రతిబింబించారని కొనియాడారు. పుస్తక సమీక్షకులు సామాజిక ఉద్యమకారుడు కవి ఎదిరేపల్లి కాశన్న మాట్లాడుతూ... కవి నిరంతరం చైతన్యుడనేదానికి ఉదాహరణ మన యడవల్లి నాగరాజు అని కొనియాడారు. చదువులేని సంచార జాతుల్లో చదువుకున్న మొదటి తరంగా నాగరాజు పైకొచ్చారని అన్నారు. ఆయన కవితలు బాలకార్మికలోకం, జోగిని, కార్మికుల దోపిడీ, వరకట్న దురాచారాలపై విసిరిన ఈటెలని, పేదవర్గాల గొంతుకగా యడవల్లి కవిత్వం నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వహీద్ ఖాన్, కల్వకోలు మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, గడ్డం మల్లికార్జున్, లలిత, గడ్డంపల్లి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశీలన పూర్తి

ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులపై విద్యాశాఖ తనిఖీలు



అచ్చంపేటలో టెన్త్ ప్రాజెక్టు వర్క్, స్లిప్‌టెస్ట్‌లు, ఇంటర్నల్ మార్కుల తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- ఇవి నిర్ధారిస్తేనే ఇంటర్నల్ మార్కులు
- ఆ తర్వాతే ఉన్నత కమిటీకి నివేదిక

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు **288**

పదోతరగతి విద్యార్థులు **10,559** మంది

60 పరీక్ష కేంద్రాలు

అచ్చంపేట: పదో తరగతి పరీక్షలు మార్చి18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులపై విద్యాశాఖ తనిఖీలు నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా 288 ప్రభుత్వ, ప్రైవేట్, ఏయిడెడ్ పాఠశాలల పరిధిలో 10,559 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల నమోదుపై ఆరా తీసింది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతి మండల పరిధిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు టెన్త్ ఇంటర్నల్ మార్కుల నమోదు తీరును పరిశీలించి ఉన్నత కమిటీకి నివేదిక సమర్పించనున్నాయి. ఆ తర్వాతే ఇంటర్నల్ మార్కులను ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్‌లో నమోదుకు వెసలుబాటు ఉంటుంది. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులకు ఫార్మేటివ్ టెస్టులు నిర్వహించడంతో పాటు ప్రాజెక్టులు, రికార్డులను పరిశీలించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు మార్కులు నమోదు చేసిన విషయం విధితమే.

ప్రైవేట్ దుమారం..

ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు అశాస్త్రీయంగా అంతర్గత మార్కులు వేశారనే ఆరోపణలు దుమారం రేగింది. స్కూల్ పరిధిలో నిర్వహించిన ఫార్మెటివ్ టెస్టులో విద్యార్థికి అతి తక్కువ మార్కులు వచ్చినా.. ప్రాజెక్టు వర్క్ చేయకపోయినా.. గరిష్ట మార్కులు వేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిని తప్పులుబట్టిన విద్యాశాఖ వాస్తవ పరిస్థితి కోసం ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ స్కూళ్లలోనూ సైతం క్షేత్రస్థాయి విచారణ బృందాలను రంగంలోకి దింపి విచారణ చేపట్టింది.

అంతర్గత మార్కులు ఇలా..

ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో ప్రతి పేపరు 80 **మార్కులకు ఉంటుం**ది. మరో 20 మార్కు**లను తరగతి గదిలో** ఆయా సబ్జెక్టుల వారీగా **కనబరిచే ప్రతిభ** ఆధారంగా ఇంటర్నల్‌గా **కేటాయిస్తారు. సరి**గ్గా ఐదేళ్ల కిందట కంటి**న్యూస్ అండ్ కాంప్ర**హెన్సివ్ ఇవాల్యుయేష**న్(సీసీఈ) విధాన**ంలో భాగంగా పదో **తరగతి విద్యార్థుల**కు ఇంటర్నల్ మార్కుల **విధానాన్ని ప్రవేశ**పెట్టారు. దీంతో ఆయా **స్కూళ్ల ఫార్మెటివ్** అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పేరిట ప్రతి విద్యార్థి చేసే ప్రాజెక్టు వర్క్ స్కూల్‌లో నిర్వహించే స్లిప్‌టెస్టు ప్రకారం మార్కులు కేటాయిస్తూ వస్తున్నారు. ఇలా కేటాయిస్తున్న మార్కులను ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు ఆన్‌లైన్ ద్వారా టెస్టు పరీక్ష విభాగానికి డీఈఓల ద్వారా పంపాల్సి ఉంటుంది. కాగా.. ఇవేవి నిర్వహించకుండానే ప్రైవేట్ స్కూళ్లు ఇష్టానుసారంగా గరిష్టంగా మార్కులు వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తనిఖీలు నిర్వహించాం..



ఇంటర్నల్ మార్కులకు సంబంధించి ప్రతి పాఠశాలలో రెండు, మూడు రోజులు తనిఖీలు నిర్వహించాం. ఇందు కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నాలుగు ఎఫ్ఏలు, సబ్జెక్టుల వారీగా విద్యార్థి చేసే ప్రాజెక్టు వర్క్, స్లిప్ టెస్టుల ప్రకారం 20 మార్కులు కేటాయిస్తారు. ఇందుకు సంబంధించిన మార్కుల లిస్టు ఎంఈఓలకు అందజేయాల్సి ఉంది. వారి నుంచి డీఈఓకు పంపిస్తారు.

– అర్జునయ్య
ప్రధానోపాధ్యాయుడు జెడ్పీహెచ్‌ఎస్ నడింపల్లి

మూడురోజుల పాటు

జిల్లాలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్, ప్రాజెక్టుల మార్కుల నమోదు పరిశీలన ఈ నెల 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు కొనసాగింది. డీఈఓల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మండలాల వారీగా రంగంలో దిగి క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో నాలుగు ఎఫ్ఏ టెస్టులు నిర్వహించారు. వీటితో పాటు ప్రాజెక్టులు, ఇతర రికార్డులను సైతం ప్రత్యేక బృందాలు పర్యవేక్షించాయి. ప్రతి ఎఫ్ఏ టెస్టుకు 5 మార్కుల చొప్పున నాలుగు టెస్టులకు 20 మార్కులు కేటాయించాల్సి ఉంటుంది. ప్రాజెక్టులకు ప్రత్యేక మార్కులు ఉంటాయి. ఆ తర్వాత జిల్లా పరీక్షల విభాగం ఆమోదంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మార్కులను ఎస్సెస్సీ బోర్డుకు అందజేయాల్సి ఉంటుంది.

కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే హక్కులేదు



అచ్చంపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

- ఒకరు కేఆర్‌ఎంబీకి అప్పగించి.. మరొకరు జాతీయ హోదా ఇస్తామని మోసం చేశారు
- ఎంతో మంది సీఎంలు వస్తుంటారు.. పోతుంటారు.. రాష్ట్రం తెచ్చిన సీఎం మాత్రం కేసీఆరే
- ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే నీ భరతం పడతాం
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్

నాగర్‌కర్నూల్/ అచ్చంపేట: కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు పాలమూరులో ఓట్లు అడిగే హక్కు లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కృష్ణానదిపై ఉండే ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగిస్తే.. బీజేపీ ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని మోసం చేశారని విమర్శించారు. ఆదివారం నాగర్‌కర్నూల్, అచ్చంపేటలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ రాష్ట్రానికి ఎంతో మంది సీఎంలు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ, తెలంగాణ తెచ్చిన సీఎం మాత్రం కేసీఆరే అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అందరికీ అన్నీ ఇస్తామని, ఇప్పుడు మాత్రం కొందరికి కొన్నే అంటుందని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ఇప్పటికీ రైతులు రైతుబంధు రాక ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారన్నారు. డిసెంబర్ 9న రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పటికీ వాటి ఊసే లేదన్నారు. హామీ ఇచ్చినట్లు 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోతే నీ భరతం పడతామని హెచ్చరించారు. తెలంగాణకు వస్తున్న ప్రియాంకాగాధీ ముందు యూత్ డిక్లరేషన్‌పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

కార్యకర్తలకు ఏదైనా జరిగితే 38 మంది ఎమ్మెల్యేలం బస్ వేసుకుని వస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. గ్రామాల్లో కార్యకర్తలు మనోధైర్యంతో ఉన్నారని.. నాయకులే ఇంకా ధైర్యంగా ఉండాలన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఢిల్లీలో గల్లా పట్టి ప్రశ్నించేందుకు గులాబీ కండువా ఉండాలని, అందుకోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌లో గళం విప్పాలంటే మనం ఎక్కువ ఎంపీ సీట్లు సాధించాలని, అందుకు మీరు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ఎక్కడి నుంచి ఓడిపోయామో.. అక్కడి నుంచే మొదలుపెడుతున్నామని, ఇక్కడ తక్కువ ఓట్లతో ఓడిపోవచ్చు.. రేపు పార్లమెంట్‌లో మంచి మెజార్టీతో పూర్వవైభం తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ హవా కొనసాగుతుందని అనడం అంత బోగస్ అని కేటీఆర్ విమర్శించారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

మార్పు బాగుందా..

రైతులు బాధపడుతున్నారా.. కరెంట్ కోతలు మొదలయ్యాయా.. మార్పు బాగుందా.. అని కార్యకర్తలు, నాయకులను కేటీఆర్ అడిగారు. మీ దగ్గరికి కాంగ్రెస్‌కు ఓటు వేసిన వాళ్లు వస్తే.. మార్పు బాగుందా అని పలకరించండి అన్నారు. వేసవి మొదలు కాక ముందే మంచినీటి ఇబ్బందులు మొదలయ్యాయని, మిషన్ భగీరథ మెయింటెనెన్స్ చేయడం కూడా ప్రభుత్వం నుంచి కావడం లేదన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు వారం, పదిరోజుల్లో పడుతుండేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుబంధు పడిందా అని.. ఒకరిని ఒకరు అడుగుతున్న పరిస్థితి కనిపిస్తోందని, మూడు నెలలకు వస్తుందో.. ఆరు నెలలకు వస్తుందో తెలియని పరిస్థితి దాపురించిందన్నారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు తదితరులు మాట్లాడారు. ఆయా సమావేశాల్లో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, శాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, నాగం శశిధర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్లు కల్పన, ఎడ్ల నర్సింహగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు రాంబాబునాయక్, లక్ష్మి, నాయకులు అరుణ, శ్రీకాంత్‌భీమా, రాజేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లోక్యానాయక్, అమీనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రాములు గైర్హాజర్

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ప్రస్తుత ఎంపీ పోతుగంటి రాములు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరైన ఈ సమావేశానికి ఎంపీకి ఆహ్వానం అందలేదని తెలిసింది. ఎంపీకి సమాచారం లేదన్న విషయం తెలుసుకున్న కేటీఆర్ ఆయన పీఏ ద్వారా ఫోన్ చేయించగా.. ఇప్పుడు చెబితే తాను రాలేనని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఎంపీ రాములుతోపాటు ఆయన కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌కుమార్ పార్టీ మారుతారనే ఊహాగానాల నేపథ్యంలో ఆయన గైర్హాజరు కావడం బలం చేకూరుస్తోంది. కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఆయన సన్నిహితులు, అనుచరులతో పార్టీ మారే విషయమై మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన అభిమానులు, అనుచరులు, ముఖ్యులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు వినికిడి. మొదటగా కుమారుడు భరత్‌కు నాగర్‌కర్నూల్ జెడ్పీ చైర్మన్ పదవి కోసం రెండుసార్లు ప్రయత్నించగా పార్టీ పట్టించుకోలేదు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట టికెట్ ఆశించి భంగపడ్డారు. బీఆర్‌ఎస్‌లో వరుసగా జరుగుతున్న అవమానాలతో పార్టీలో ఉండటం కంటే మారడమే సమంజసం అన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయమై 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రూ.3 కోట్లతో ఎర్రపెంటలో అభివృద్ధి పనులు



ఎర్రపెంట చెంచులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

లింగాల: నాగరకర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని ఎర్రపెంట అభివృద్ధికి రాబోవు 5 ఏళ్ల కాలంలో రూ.3 కోట్లతో ప్రాజెక్ట్ కార్యాచరణ అమలు చేస్తామని 'నీది ఇల్లిటరేట్ చిల్డ్రన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్'(నైస్) ఎక్స్ కమిషనర్ జయప్రకాష్ అన్నారు. ఆదివారం 'నైస్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెంటలోని 100 కుటుంబాలకు ఆహార ధాన్యాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోవు 5 సంవత్సరాల వరకు పెంటలోని చెంచులకు ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ ఉంటుందన్నారు. ఆహార ధాన్యం పంపిణీతో పాటు పెంటలో మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, పరిశుభ్రత తదితర వాటిని చేపడుతామన్నారు. పెంటను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటానికి ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. తాము చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి చెంచులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా తమ ప్రయత్నంలో చెంచులను మద్యానికి దూరంగా ఉంచడం, మద్యాన్ని మాన్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పూర్ణచంద్రరావు, పుష్పరాజు, ఆర్డీటీ ఏటీఎల్ రాధ, చెంచు నాయకులు, చెంచులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 83 పోస్టులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని డీఎంహెచ్ఓ డా.సుధాకర్‌లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల ఖాళీల వివరాలను www.nagarkurnool.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 26 నుంచి 28 వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రజాసంఘాలు బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్ రూరల్: సీపీఐ అనుబంధ సంఘాలు నిర్మాణపరంగా బలంగా ఉంటే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ప్రజాసంఘాల బాధ్యుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యల కోసం ప్రజాసంఘాల పాత్ర వహించాలన్నారు. నిరంతరం బీసీ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని, కళాకారుల కోసం ఉద్యోగాల నియామకాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు రైతుల పక్షాన, రైతుల కోసం, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, రైతులను చైతన్య పరచడంతో పాటు పోరాటాలు కొనసాగించాలన్నారు. రైతులు వ్యవసాయం చేస్తే అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం రైతు సంఘాల నాయకులకు ఉందన్నారు. యువజన సంఘాల నాయకులు, యువత ఉద్యోగాల కోసం, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం, మహిళా సంఘాల నాయకులు మహిళలపై జరుగుతున్న దాడుల నిర్మూలన కోసం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారేడు శివశంకర్, రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏసయ్య, కృష్ణాజీ, బాలమురళి, వెంకటమ్మ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

- 'అమృత్‌భారత్' పథకం కింద ఉమ్మడి జిల్లాలో మూడింటికి చోటు
- జడ్చర్లకు రూ.10.94 కోట్లు, గద్వాలకు రూ.9.49 కోట్లు, షాద్‌నగర్‌కు రూ.9.59 కోట్లు
- ఇప్పటికే మొదటి దఫాలో మహబూబ్‌నగర్‌కు రూ.39.9 కోట్లు మంజూరు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

రైల్వేస్టేషన్లకు సొబగులు



ఏబీఎస్‌ఎస్‌కు ఎంపికైన గద్వాల రైల్వేస్టేషన్



జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో ఏబీఎస్‌ఎస్ పనుల శంకుస్థాపన చేసిన ఏర్పాట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్లను మరింత అభివృద్ధి చేయడానికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలోని మూడు స్టేషన్‌లకు అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద నిధులు కేటాయించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌ను ఎబీఎస్ఎస్ కింద మొదటి విడతలో ఎంపిక చేసి రూ.39.9 కోట్లు కేటాయించారు. గతేడాది ఆగస్టు 6న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహబూబ్‌నగర్ తోపాటు తెలంగాణలోని 20 రైల్వేస్టేషన్లకు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

తాజాగా మూడు స్టేషన్లకు..

రైలు ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలను అందించడానికి భారీస్థాయిలో రైల్వేస్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడానికి భారతీయ రైల్వేలో గొప్పలు మార్పులు తీసుకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మూడు రైల్వే స్టేషన్‌లకు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 15 స్టేషన్లను ఎంపిక చేయగా ఉమ్మడి జిల్లాలో జడ్చర్ల, గద్వాల రైల్వేస్టేషన్‌లకు చోటు దక్కింది. ఇందులో జడ్చర్ల రైల్వేస్టేషన్‌కు 10.94 కోట్లు, గద్వాల రైల్వేస్టేషన్‌కు రూ.9.49 కోట్లు, షాద్‌నగర్ స్టేషన్‌కు రూ.9.59 కోట్లు కేటాయించారు. సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే రైల్వేశాఖ అధికారులు ఆయా స్టేషన్లలో కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆధునీకరణ పనులు, సౌకర్యాలు

అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద జడ్చర్ల, గద్వాల స్టేషన్లను అన్నివిధాలుగా ఆధునీకరించనున్నారు. ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని వసతులు కల్పించనున్నారు. ముఖ్యంగా స్టేషన్ ముఖద్వారాలు, ప్రణాళికబద్ధమైన పార్కింగ్, పాదచారుల మార్గాలు, మెరుగైన లైటింగ్ సౌకర్యాలతోపాటు ఆహ్లాదకరమైన అనుభూతి కోసం సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. అదేవిధంగా ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి పథకం కోసం స్టాల్ కేటాయించడం , అత్యున్నత ప్లాట్‌ఫారాలు, తగిన ప్లాట్‌ఫారం స్లాటర్‌ల నిర్మాణం, అధిక నాణ్యతగల పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, ఎల్‌ఈడీ ఆధారిత స్టేషన్ నేమ్ బోర్డులు, వెయింటింగ్ హాళ్ల మెరుగుదల తదితర ప్రయాణికుల సదుపాయాలు, సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.

రూపురేఖలు మారుతాయి



అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద జడ్చర్ల, గద్వాల, షాద్‌నగర్ స్టేషన్‌లకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ఈ నిధులతో రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారిపోతాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటవుతాయి. మూడు స్టేషన్‌లకు ఏబీఎస్ఎస్‌కు కింద ఎంపిక చేసినందుకు ప్రధానికి కృతజ్ఞతలు.

– గోపాల్ నారాయణ,
డీఆర్‌యూసీసీ మెంబర్

క్లుప్తంగా

తల్లి మందలించిందని విద్యార్థి ఆత్మహత్య

మద్దూరు: తల్లి మందలించిందని ఇంటర్ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకున్న ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన అనిత తన కుమారుడు నరేందర్ (17) నారాయణపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి శనివారం రాత్రి ఆలస్యంగా రావడంతో తల్లి తిట్టింది. దీంతో మనస్తాపం చెంది క్షణికావేశంలో శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వ్యాపారం చేసుకొని తిరిగి ఇంటి వచ్చే సరికి కుమారుడు ఉరివేసుకోవడంతో వెంటనే 108 అంబులెన్స్ ఫోన్ చేసి నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేధింపులు భరించలేక వివాహిత ..

జడ్చర్ల: భర్త, వారి కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం స్థానిక పాతబజార్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. పాతబజార్‌కు చెందిన ఎనకపల్లి లక్ష్మమ్మ(30)ను అదనంగా వరకట్నం తీసుకురావాలంటూ భర్త, అత్త, మరిది, ఆడపడుచులు మానసిక, శారీరక వేధింపులకు పాల్పడ్డారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుంది. మృతురాలి సోదరుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మక్తల్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సామాన్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. సామాన్‌పల్లికి చెందిన పరమేశ్వరమ్మ(25) తన భర్త సత్యనందతో అప్పుడప్పుడు సంసార విషయంలో గొడవ పడేవారు. ఈ క్రమంలో ఇద్దరూ గొడవ పడగా పరమేశ్వరమ్మ 23న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను మక్తల్ ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం నారాయపేటకు, అక్క డి నుంచి మహబూబ్‌నగర్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి లాల్‌సింగ్ తెలిపారు.

30 గొర్రెల అపహరణ

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లిలోని కుర్వ ఎల్లప్పకు చెందిన 30 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జున్ తెలిపారు. శుక్రవారం నేరడగం శివారులోని చాపలబాషాకు చెందిన గొర్రెలను పొలంలో వల వేసి అక్కడే పడుకున్నారు. ఉదయం లేచి చూస్తే గొర్రెలు కనిపించలేదని, చుట్టు పక్కల వెతికిన కనిపించలేదని, ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

జింక మృతి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో బండమీదిపల్లి నుంచి అల్లీపూర్ వెళ్లే రోడ్డు మార్గంలోని పాలమూరు యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్లాక్ ఎదుట ఆదివారం ఉదయం జింక మృతి చెందింది. ఆ రోడ్డుపై వెళ్లే వాకర్స్ గమనించి విషయం అటవీశాఖ అధికారులకు చెప్పారు జింకను ఏదైనా ద్విచక్ర వాహనం ఢీకొట్టిందా? ఎలా మృతి చెందింది అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయంపై జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణను వివరణ కోరగా అడవిలో నుంచి జింక బయటకు రావడం వల్ల కుక్కలు వెంటాడం ద్వారా యూనివర్సిటీ గోడ వద్ద జరిగిన రాపిడ్‌లో మృతి చెందినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. జింకను పోస్టుమార్టం కోసం పంపిస్తామని తెలిపారు.

31 గుడ్లు పెట్టిన నీరుగట్ట పాము



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో భద్రపర్చిన నీరుగట్ట పాము శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 31 గుడ్లు పెట్టినట్లు సర్పరక్షకుడు సదాశివయ్య తెలిపారు. శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్–3 వలంటీర్లు జడ్చర్లలోని ఒక ఇంట్లోకి వచ్చిన నీరుగట్ట పామును సంరక్షించి.. అడవిలోకి వదిలేందుకు గాను ఎడ్యుకేషన్ సెంటర్‌కు తీసుకువచ్చారు. అయితే సాయంత్రం నీరుగట్ట పాము గుడ్లను పెట్టడాన్ని గమనించి జాగ్రత్త పరచగా.. ఆదివారం ఉదయం వరకు మొత్తం 31 గుడ్లు పెట్టినట్లు వివరించారు. గుడ్లు పొదగడానికి 70 రోజుల వరకు సమయం పడుతుందని, కానీ.. కళాశాలలో గుడ్లు పొదిగేందుకు వసతులు లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి పంపిస్తామని చెప్పారు. సాధారణంగా నీరుగట్ట పాము 100 గుడ్ల వరకు పెడుతుందని, అయితే తాము సంరక్షించిన నీరుగట్ట పాము చిన్నది కావడంతో తక్కువ గుడ్లు పెట్టిందన్నారు. నీరుగట్ట పాము విషరహిత సర్పం అన్నారు. శనివారం ఒక్కరోజే పట్టణంలో మొత్తం మూడు పాములు పట్టుకున్నట్లు వెల్లడించారు.



స్వామివారికి గరుడవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు



రథోత్సవాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ రవినాయక్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

శ్రీనివాసా.. గోవిందా

- వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం
- గోవింద నామంతో మార్మోగిన మన్యంకొండ
- జనసంద్రాన్ని తలపించిన క్షేత్రం
- కిక్కిరిసిన జాతర ప్రాంగణం



రథంపై ఊరేగుతున్న మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: నిండు పౌర్ణమి వెన్నెల్లో మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి రథోత్సవంతో మన్యంకొండ క్షేత్రం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. భక్తుల హరిన్నామశ్చరణతో పులకించింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని మెట్ల మార్గం గుండా తేరు మైదానానికి భారీ ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల హరిన్నామశ్చరణ, పురోహితుల వేదమంత్రాలు, కాగడాల వెలుతురు, బాణాసంచా మోతల మధ్య స్వామివారి గరుడ వాహనం ముందుకు సాగింది. అనంతరం తేరు మైదానంలో కుంభంపోసి ప్రత్యేక పూజలు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన రథంపై స్వామివారిని ఊరేగించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. రథం లాగే సమయంలో మహిళలు పూనకాలు నిండారు. ఈఏడాది కూడా బాణాసంచా కాల్చడం హైలైట్‌గా నిలిచింది. ఓ పక్క తారాజువ్వల సందడి.. మరోపక్క బాణాసంచా పేలుళ్లతో తేరు మైదానం మార్మోగింది. రథోత్సవం అనంతరం స్వామివారిని మళ్లీ గరుడ వాహనంపై మెట్ల మార్గం గుండా గర్భగుడిలోకి తీసుకెళ్లారు. కాగా భక్తులతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆటబొమ్మలు, గాజులు, మిఠాయి దుకాణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

ఘనంగా అశ్వవాహన సేవ..

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామివారికి అశ్వవాహన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి అశ్వవాహనంపై కొలువుదీరగా.. గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వర్ణాభరణ అలంకరణలో స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు.

■ లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవంలో కలెక్టర్ రవినాయక్‌తో పాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ముందుగా వారికి ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామిని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొలిచి మొక్కిన వారికి కొంగుబంగారంగా స్వామివారు భక్తులను అనుగ్రహిస్తున్నారని, స్వామివారి కృప భక్తులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



రథంలో కొలువుదీరిన స్వామివారు

సామర్థ్యానికి మించి ప్రయాణం

- పట్టణంలోని నేతాజీచౌరస్తాలో బస్సు నిలిపివేసిన డ్రైవర్
- కొందరు ప్రయాణికులు దిగటంతో ముందుకు సాగిన బస్సు



ఫుట్‌బోర్డ్‌పై ఒంటికాలితో నిల్చున్న ప్రయాణికులు

జడ్చర్ల టౌన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తరువాత ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి తోడు మేడారం జాతరకు బస్సులు వేయటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం 11 గంటలకు హైదరాబాద్ –2 డిపోకు చెందిన బస్సు ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరింది. హైదరాబాద్ నుంచి జడ్చర్ల వరకు ప్రయాణికులు నిండుగానే ఎక్కారు. పట్టణంలోని నేతాజీచౌరస్తాకు చేరుకున్నాక అక్కడ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఎక్కేందుకు ప్రయత్నించారు. జడ్చర్ల నుంచి కొల్లాపూర్ మార్గంలో రోడ్డు బాగాలేదని, గుంతలు అధికంగా ఉన్నందున ఫుట్‌బోర్డ్ ప్రయాణం మంచిదికాదని డ్రైవర్ శ్రీకాంత్ ప్రయాణికులను వారించాడు. అతడి మాటలను ప్రయాణికులు పెడచెవిన పెట్టడంతో తాను బస్సును ముందుకు తీసుకెళ్లలేనని జడ్చర్ల పట్టణంలోని నేతాజీచౌరస్తాలో డ్రైవర బస్సులోంచి కిందకు దిగాడు. కనీసం కొంతమంది ప్రయాణికులైనా బస్సు దిగాలని పట్టుబట్టాడు. ఈ క్రమంలో ప్రయాణికులు అతడితో వాగ్వాదానికి దిగారు. బస్సులు రావటంలేదని గంటల తరబడి వేచి ఉన్నామని వాదించారు. అయితే ఫుట్‌పాత్‌పై ఒంటికాలితో ప్రయాణికులు ఐదారుగురు నిల్చుని ఉండటాన్ని డ్రైవర్ తప్పుబట్టాడు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులవుతారని ప్రశ్నించాడు. వెనుకాల బస్సులు వస్తున్నాయని, దాంట్లో వెళ్లాలని మొరపెట్టుకున్నా ప్రయాణికులు వినకుండా అలాగే ఎక్కారు. దీంతో చేసేది లేక జడ్చర్లలో ఎక్కిన ప్రయాణికులను బస్సు నుంచి దించి ముందుకు వెళ్లాడు.

200 మంది..

బస్సులో ఓవర్‌లోడ్ అయ్యింది. 200 మంది ప్రయాణికులు ఎక్కారు. కొందరైతే ఫుట్‌బోర్డుపైన ఒంటికాలితోనే నిల్చుని ఉన్నారు. జడ్చర్ల నుంచి కొల్లాపూర్ వరకు రోడ్డు బాగాలేదని ప్రయాణికులతో మొరపెట్టుకోవాల్సి వచ్చింది. అందుకే బస్సును నిలిపివేసి సీటులోంచి కిందకు దిగాను. ఏదైనా జరగరానిది జరిగితే మేమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుకే మా జాగ్రత్తలు మేం తీసుకుంటున్నాం.



– శ్రీకాంత్, ఆర్టీసీ బస్సు డ్రైవర్

నవ సమాజ నిర్మాణానికి రచనలు అవసరం

'వనపర్తి ఒడిలో' పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ హరగోపాల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొ.హరగోపాల్, ఇతర నాయకులు

వనపర్తిటౌన్: పడిపోతున్న మానవీయ విలువలు, పర్యావరణ విధ్వంసం పూర్తిగా దెబ్బతినకముందే ఆయా ప్రాంతాల రూపురేఖలను పుస్తక రూపంలో నిక్షిప్తం చేయాల్సిన అవసరముందని పౌర హక్కుల నేత, శిక్షా సంఘర్ష్ వేదిక జాతీయ కన్వీనర్ ప్రొ.హరగోపాల్ తెలిపారు. రాఘవ శర్మ రచించిన వనపర్తి ఒడిలో పుస్తకావిష్కరణ ఆదివారం పాలిటెక్నిక్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. మానవీయ విలువల పునరుద్ధరణకు, నవ సమాజ నిర్మాణం కోసం మనుషుల మధ్య అంతరాలు అధిగమించేందుకు ప్రేమ ఒక్కటే సరైన మందన్నారు. మార్పు మొదలయ్యేందుకు జీవితంలో పెళ్లి తొలి అడుగు అని, దంపతుల మధ్య ఉండే అన్యోన్యత కుటుంబానికి అబ్బడం ద్వారా బాధ్యతయుతమైన పౌర సమాజం రూపుదిద్దుకుంటుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థి కేంద్రంగా విద్యావిధానం ఉండటం లేదని అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలు మానవీయంగా, అసమానతలు లేని సమాజంగా మారాలంటే పేద, ధనిక తేడా లేకుండా కామన్ విద్యావిధానం అందాలని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా పాఠాలు బోధించడం ద్వారా సారవంతమైన పౌరులుగా ఎదుగుతారాని చెప్పారు. వనపర్తి చరిత్ర ఘనమైందని, రాజారామేశ్వర్‌రావు, డాక్టర్ బాలకృష్ణయ్య వ్యక్తుల మానవీయ ఔదార్యం తెలుగు సమాజానికి తెలుసన్నారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణలో కొండలు మాయమవుతున్నాయని, ప్రకృతిని నాశనం చేయకముందే కవులు మేలుకోవాలని చెప్పారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులు, పౌర సమాజం ప్రతినిధులను పార్టీలో చేర్చుకునే ప్రయోగానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూనుకోవడంతో ప్రజల పక్షాన నిలిచే గొంతులు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో పౌర సమాజంపై బాధ్యత కలిగిన వ్యక్తులు పార్టీలకు దూరంగా ఉండటం ద్వారా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జెతిన్, ఇక్బాల్, వెంకటేశ్వర శెట్టి, నారాయణ, సత్యనారాయణ, రాధా, జనజ్వాల, కుమారస్వామి, రాజశేఖర రాజు, వేణుగోపాల్, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం ఒత్తిడి పెంచాలి

పాలమూరు జిల్లాకు దక్కాల్సిన నీటి వాటాపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రొ.హరగోపాల్ ఎమ్మెల్యే మేఘారెడ్డికి సూచించారు. కాంగ్రెస్ నాయకుడు లక్కాకుల సతీష్ ఎమ్మెల్యేను కలిసేందుకు ఆహ్వానించడంతో ఆదివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో ప్రొ.హరగోపాల్, వనమాల, పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి, పాశం యాదగిరి, పలువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు ఒత్తిడి పెట్టకపోవడం వలనే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును మధ్యలో వదిలేసి కాళేశ్వరాన్ని నిర్మించారని, అది అవినీతి అని తేలిపోయిందని ప్రభుత్వమే చెబుతుందని తెలిపారు. పాలమూరు సమగ్ర అభివృద్ధికి 14 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అంతా సమావేశమై విద్యా, వైద్యం, ఉపాధి, ఇరిగేషన్ రంగాల్లో ప్రాధాన్యత ఉండేలా చూడాలన్నారు. ఇప్పటికే పాలమూరుకు దక్కాల్సిన నీటి వాటాపై ఒత్తిడి పెంచకపోతే అన్యాయం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల స్వేచ్ఛను హరించేలా వ్యవహరించొద్దని, ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని సూచించారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి మాట్లాడుతూ.. పాలమూరు ప్రజలు వలస వెళ్లడం ఆగలేదని, బస్సులు మాత్రమే ఆగాయని, దీనిపై సమగ్రంగా అధ్యాయనం చేసి వలస వెళ్లిన ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు.

గోదాంలో ధాన్యం చోరీ

- 2,500 మెట్రిక్ టన్నుల్లో 20 వేల బస్తాలు మాయం
- పెద్దకొత్తపల్లి మండలానికి చెందినవారే ఈ సంఘటనకు కారకులు



శుక్రవారం గోదాంలో వడ్లను దొంగలించేందుకు వచ్చిన డీసీఎం

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామ శివారులోని 2,500 మెట్రిక్ టన్నుల గోదాంలో దొంగలు పడ్డారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 20 వేల బస్తాలను దర్జాగా ఎత్తుకెళ్లారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లలోని పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన కొందరు ముఠాగా ఏర్పడి ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వనపర్తి జిల్లాకు చెందిన ఒక రైస్‌మిల్లు యజమాని గోదాంను లీజుకు తీసుకొని ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని భద్రపరిచాడు. యధావిధిగా ఈ నెల 20న గోదాంలోని వడ్లను తరలించేందుకు యజమాని రావడంతో అప్పటికే షెట్టర్ తాళాలు పగలగొట్టడంతో గోదాంలోకి వెళ్లి చూడగా.. ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. దీంతో దొంగలు ఖచ్చితంగా తిరిగి వస్తారని గోదాం సిబ్బంది నిఘా వేశారు. దీంతో శుక్రవారం రాత్రి సమయంలో డీసీఎంలో వడ్లను నింపుతుండగా.. గమనించిన గోదాం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు నలుగురు దొంగలను డీసీఎం, బొలెరొ వాహనాన్ని పట్టుకున్నారు. పోలీసులు రావడాన్ని గమనించిన మరికొంత మంది దొంగలు పారిపోయారు.

ఎన్నో అనుమానాలు..

పెబ్బేరు– కొల్లాపూర్ ప్రధాన రహదారి పక్కనే నిత్యం ఎన్నో వాహనాలు అదే రోడ్డు మీద తిరుగుతుంటాయి. అదేవిధంగా పెద్దదగడకి అతి సమీపంగా పోలీస్‌స్టేషన్‌కు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. దొంగలు ఇంత దర్జాగా వడ్లను దొంగలించారంటే ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. దొంగలించిన ధాన్యం సైతం అదే ప్రాంతంలో పెట్టడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దొంగతనానికి వచ్చిన దొంగలు అందరు కూడా కొల్లపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన వారే ఉన్నారు. పోలీసులు విచారణ చేపట్టి మిగతా దొంగలను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

పశుగ్రాసం దగ్ధం



దగ్ధమైన వరిగడ్డి

పాన్‌గల్: ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైన ఘటన చిక్కేపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముంత సత్యానారాయణ గ్రామ సమీపంలో పశువుల మేత కోసం పది ట్రాక్టర్ల పశుగ్రాసం(వరిగడ్డి) నిల్వ చేసుకున్నాడు. అకస్మాత్తుగా మంటలు వ్యాపించి పశుగ్రాసం దగ్ధమైంది. విషయాన్ని గమనించిన రైతు, పరిసరాల రైతులు కలిసి మంటలు పక్కకు వ్యాపించకుండా సమీపంలోని బోరు నీటితో అదుపుచేసినా పూర్తిగా దగ్ధమైంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నల్లగొండ జిల్లాలో ఘటన.. మృతుడు గోదల్‌వాసి



సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

కట్టంగూర్: రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. నాగర్‌కర్నూర్ జిల్లా బల్మూర్ మండలం గోదల్ గ్రామానికి చెందిన గోవిందు బాలయ్య(50) హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. బాలయ్య తన కొడుకు లింగస్వామి, మనువడు నమీశ్, మనువరాలు అంకృత, తమ్ముడి కూతురు చందనతో కలిసి ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ఎర్రవరంలో ఉన్న బాల ఉగ్రనరసింహస్వామిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలోని ఎరసానిగూడెం స్టేజీ వద్దకు రాగానే అతివేగంతో కారు నడుపుతున్న లింగస్వామి ప్రమాదవశాత్తు అదుపుతప్పి హైవే పక్కనే డివైడర్ ఢీకొట్టి అనంతరం బస్టాప్‌లో పార్కింగ్‌లో ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలయ్య అక్కడికక్కడే మృతిచెందగా లింగస్వామి, చందన, నమీశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాలయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపిక



దోకూర్ విద్యార్థి సాయి చరణ్‌తేజ రూపొందించిన చిత్రలేఖనం

దేవరకద్ర: దేవరకద్ర మండలం డోకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థి సాయి చరణ్‌తేజ రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12న జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా.. అక్కడ కూడా గెలుపొంది ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజున వరంగల్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర అధికారుల చేతుల మీదుగా బహుమతి అందుకోబోతున్నాడని డీఈఓ రవీందర్, హెచ్‌ఎం బాలరాం ఒక ప్రకటనలో తెలియజేశారు. 'పర్యావరణం పరిరక్షణ.. ప్లాస్టిక్ రహిత ప్రపంచం' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని డోకూర్ అధ్యాపకులు, గైడ్ టీచర్ చందన, తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని కోరారు.

జువెలరీ షాప్‌లో వెండి..

మహబూబ్‌నగర్ క్రైం: పట్టణ నడిబొడ్డున ఉన్న దుకాణంలో భారీ చోరీ జరగడం కలకలం రేపుతోంది. తాళం వేసి ఉన్న బంగారు, సిల్వర్ దుకాణంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగులకొట్టి.. లోపలికి ప్రవేశించి విలువైన సొత్తును అపహరించుకుని వెనక వైపు ఉన్న మరో షెట్టర్‌లో నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ సీఐ భీంకుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ ఏరియాలో ఉన్న బాలాజీ సిల్వర్ ప్యాలెస్ దుకాణంలో శనివారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి దుకాణంలో దాదాపు 7–8 కిలోల వెండి అపహరణకు గురైందని నిర్వాహకుడు మాణిక్య శ్రీధర్ ఫిర్యాదు ఇచ్చినట్లు సీఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించడంతోపాటు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. అయితే ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు సీసీ టీవీలో రికార్డ్ అయినట్లు తెలుస్తోంది. సిల్వర్‌తో కొంత బంగారం కూడా చోరీ అయినట్లు సమాచారం. కానీ, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనలేదు.